కథ

# పెళ్ళిఫోటో

— స్వామి చిత్రానంద



ILLUSTRATION: AKBAR

“ఎన్నా! ఇప్పిడి నేరా పోరింగె?” అంది స్కూటర్ వెనక కూచున్న పంకజం.

ఆ మాటలు స్కూటర్ నడుపుతున్న జెగన్నాథానికి వినబడలేదు. అతను జోరుగా పోతున్నాడు. పైగా హెల్మెట్ కూడా పెట్టుకున్నాడు.

“ఉంగలా - ఎంగె పోరింగె?” అని గట్టిగా అరిచి, వీపు మీద చరిచింది.

ఆ అరుపుకీ, చరుపుకీ జెగన్నాథం ఈ లోకంలోకి వచ్చాడు.

ఆ అరుపూ, చరుపూ అతని భార్యవి కావు. ఆరోజే కొత్తకాపురంలో కాలుపెట్టబోతున్న తన భార్య అంత సాహసం చేయలేదనుకుని స్కూటర్ ఆపుచేశాడు. వెనక్కి చూశాడు. అతని అనుమానం నిజమైంది. వెనక కూచున్నది అతని భార్యామణి కాదు. అతని భార్య ఏమైందని అనుమానం వచ్చింది. అతని గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. అతను హెల్మెట్ తీసి-

“మీరు?...మీరు?...” అని భయంగా వసిగాడు.

“నీంగ?..నీంగ?” అని ఆమె కూడా వసిగింది.

“మీరు నా స్కూటరెలా ఎక్కారు?” అని అరవంలో అడిగాడు ఆమెకు తెలుగు రాదని అర్థమై.

ఆమె సమాధానం కూడా అరవంలోనే చెప్పింది.

“నా ఖర్మ కాలి..ఆ రైలు గేటు దగ్గర, చీకట్లో మా స్కూటరు గుర్తు తెలియలేదు. గేట్ లోంచి దూరి ఇవతలకు వస్తూన్న నేను, హెల్మెట్ తగిలించుకున్న మీ బుర్ర మా ఆయనదే అనుకుని వెనకాల ఎక్కి కూచున్నాను. మీరైనా కాస్త వెనక్కి చూడొద్దూ?” అంది కోపంగా.

“మరి! నా స్కూటర్ ఎక్కాల్సిన మా ఆవిడ?” అన్నాడు అరవంలో.

“నన్నడుగుతారేంటి? ‘మావారేరి?’ అని నేను మిమ్మల్ని అడిగానా?” అని కసిరింది ఆమె.

జెగన్నాథం ఏమీ మాట్లాడలేక తల దించుకున్నాడు.

అంతలోనే అలా ఖాళీగా ఆటో వస్తోంది. ఆమెకు ప్రాణం లేచివచ్చింది.

“ఆటో!” అని అరిచింది.

ఆటో ఆగింది.

“కె.కె. నగర్ వర్రియా?” అని అడిగింది.

“వాంగమ్మ - నానుం అంద పక్కందా పోరేన్” అన్నాడు డ్రైవరు.

“ఆహా! ఎన్నాళ్ళకి ఆటో డ్రైవరుకీ, ప్యాసింజరుకీ ఏకాభిప్రాయం కుదిరింది!” అనుకుని ఆమె ఆటో ఎక్కింది.

ఆటో బయల్దేరి వెళ్ళింది.

జెగన్నాథం విధి లేక, స్కూటర్ స్టార్ట్ చేసి, వెనక్కి తిరిగి, తాను దూరి వచ్చిన రైల్వే గేటు దగ్గరకు వెళ్ళాడు. ఇవతల పక్కకు తొంగి చూశాడు. తెల్ల చీరతో వుండే నల్ల పిల్ల (అతని భార్య) కనిపించలేదు. గేటు దూరి అవతల పక్కకు వెళ్ళాడు. అవతల పక్కన కూడా లేదు. గేటు కీపర్ని-

“నల్లపిల్ల, తెల్లచీర, మల్లెపూలు చూశావా?” అని అరవంలో అడిగాడు.

“నేనెక్కడ చూశాను సార్? అసలే చీకటి రాత్రులు! కరెంటు కూడా లేదు” అన్నాడు అరవంలో.

అక్కడ కాసేపు చూసి, ముందుకు వెళ్ళి ఆటో స్టాండులో అడిగాడు. అక్కడ కూడా ఎవ్వరూ చెప్పలేదు.

రైల్వే గేటు అవతల వరకూ ఇద్దరూ స్కూటర్ మీద కలిసే వచ్చారు. అక్కడ దిగారు. అతను స్కూటర్ తోసుకుంటూ, గేటు దూరి ఇవతలకు వచ్చాడు. స్టార్ట్ చేశాడు. తన స్కూటర్ ఎక్కిన ఆమె తన భార్యే ననుకుని బయల్దేరాడు. వెనక్కి తిరిగి చూడలేదు. చూస్తే అసలు ఏ గొడవా వుండేది కాదు. ఆమె ఏమయిందో! ఎక్కడకు వెళ్తుంది? ఎలా వెళ్తుంది? వూరు తెలియదు. భాష తెలియదు. ఎవరైనా కిడ్నాప్ చేస్తే ఏమవుతుంది!! దిక్కు తోచడం లేదు. ఏమీ అర్థం కావడం లేదు.

పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి రిపోర్ట్ ఇచ్చాడు.

అలాగే బాధగా ఇంటికి చేరాడు.

కొడుకూ, కోడలూ వస్తారని ఆశగా గుమ్మం దగ్గర ఎదురు చూస్తోన్న వెంకాయమ్మ గారికి కొడుకు ఒంటరిగా రావడం ఆశ్చర్యం కలిగించింది. జరిగిందంతా తల్లికి చెప్పాడు జెగన్నాథం.

“అదేవిట్రా? ఆమాత్రం వెనకా ముందూ చూసుకోవద్దూ? అయినా, ఆ ఎక్కి కూచునే ఆడది మాత్రం ఏ స్కూటరు పడితే ఆ స్కూటరు ఎక్కేయడమేనా? ఆ వున్నవాడు మొగుడు అవునో, కాదో కాస్త చూసుకోవద్దూ?” అంది.

తల వంచుకుని బూట్లు విప్పుకుంటున్నాడు జెగన్నాథం.

“సర్లే. లే. స్నానం చెయ్యి. భోంచేద్దువు గాని. పొద్దున్నే పోలీసు రిపోర్టిస్తే సరి!”

“రిపోర్టు ఇచ్చే వచ్చాను. దాని ఫోటో కాపీ చేయించి రేపు టీవీకి ఇస్తాను”.

“అన్నట్టు మీ పెళ్ళి ఫోటో ఫ్రేము కట్టించి తెస్తానన్నావు. ఏమైందీ?’

“తెచ్చాం. దాన్ని పట్టుకునే కూచుంది అది”.

“ఆ వెర్రి మొహం ఎక్కడుందో! ఎలా వుందో! నీలాంటి మంచివాడి చేతిలో పడితే ఫరవాలేదు. ఏదన్నా రౌడీలు దాన్ని నమ్మించి తీసుకుపోతే!”

జెగన్నాథానికి భయం వేసింది. అన్నం తినాలని లేదన్నాడు. ఆమె బలవంతం చేస్తే కాస్త ఎంగిలి పడ్డాడు.

*** *** ***

ఆటోలో వచ్చిన పంకజం కె.కె. నగర్‌లో తమ ఫ్లాట్ దగ్గర దిగింది. ఆటోకి డబ్బులిచ్చి పంపేసి, తాను మేడ మీదకు వెళ్తూ, మెట్ల దగ్గర నాళ్నాయన స్కూటర్ చూసి, ఆయన ఇల్లు చేరాడని తృప్తి పడింది. ఆమెను అప్పుడప్పుడు ఇలా వదిలేసి రావడం ఆయనకేం కొత్త కాదు. మెట్లు ఎక్కి తమ ఫ్లాటు లోకి వచ్చింది.

హాల్లో ఆమె భర్త, ఎదుటి ఫ్లాట్ ఆరుముగం, మరో అమ్మాయీ కూచుని వున్నారు.

“ఈ అమ్మాయి ఎవరు?” అని అడిగింది పంకజం అరవంలో.

“రైలు గేటు దగ్గర ఈ అమ్మాయి నా స్కూటరు ఎక్కిందనుకుంటూ. నువ్వే ఎక్కావనుకుని ఇంటికి వచ్చేశాను” అన్నాడు భర్త.

“మంచి పని చేశారు. మీ మగాళ్ళంతా ఇంతే! కొంగు తగిలితే చాలు! ఒళ్ళు తెలియదు!” అని అరిచింది అరవంలోనే.

“ఏమ్మా! యార్ నీ? వుంగ వీడు ఎంగె?” అని అడిగింది ఆ అమ్మాయిని.

“నాకేం తెలియదు. మీ మాటలేం అర్థం కావడం లేదు” స్వచ్ఛమైన తెలుగులో చెప్పింది.

“ఆ అమ్మాయికి తెలుగు తప్ప ఏ భాషా తెలియదు” అన్నాడు ఆరుముగం అరవంలో.

“అయితే 104 నెంబరు తెలుగు మామిని పిలిస్తే సరి!” అంది పంకజం అరవంలో.

‘ఆవిడకి కబురు చేశాం. ఇంట్లో లేదుట! రాగానే ఇక్కడకు రమ్మని పక్క ఫ్లాటులో చెప్పి వచ్చాం” అన్నాడు భర్త.

ఒకరి భాష ఒకరికి అర్థం కావడం లేదు. అంచేత మధురమైన ‘మౌనభాష’లో మాట్లాడ్డం ప్రారంభించారు.

“భోంచేద్దువుగాని లే” సైగ చేసింది పంకజం.

“నాకు ఒద్దు” అని సైగ చేసిందా అమ్మాయి.

“అదేవిటి? తినమ్మా” అన్నాడు అదే భాషలో పంకజం భర్త.

“ఒద్దు ఒద్దు!” అని సైగ చేసింది. ఆ అమ్మాయి.

“తెల్లారే సరికి మేం నిన్ను మీ ఆయన దగ్గరికి

చేరుస్తాం" అంది పంకజం. ఆమె పక్కనే కూచుని దగ్గరకు తీసుకుందా అమ్మయిని ఓదార్పుగా.

అంతలోనే 104 నెంబరు తెలుగు మామి వచ్చింది.

అందరి ప్రాణాలూ లేచి వచ్చాయి.

ఆమెకు టూకీగా కథ చెప్పాడు పంకజం భర్త అరవంలో.

"ఏ వూరమ్మా మీది?" అని అడిగింది మామి తెలుగులో.

"రావులపాలెం" అందా అమ్మాయి ఏడుపు మాని.

"పేరు?"

"సీత"

"ఎన్నాళ్ళయ్యింది మెడ్రాసొచ్చి?"

"ఇవాళే సర్కారులో"

"మీ ఇల్లెక్కడ?"

"నాకు ఆ పేట పేరు తెలియదు".

"పోనీ వీధి పేరు?"

"తెలియదు".

"మీ ఆయన పేరు?"

సిగ్గు పడింది సీత. తల వంచుకుంది.

"తప్పు లేదు. చెప్పమ్మా! ఇలాంటి సమయాల్లో సిగ్గు పడితే ఎలా?"

మిగతా వాళ్ళంతా చెప్పమని సైగలు చేశారు.

సీత మాట్లాడ్డం లేదు. తల వంచుకునే వుంది.

'ఆ చంకలోది ఏమిటి?" అని అడిగింది మామి.

సిగ్గు పడుతూనే సీత ఆ ఫొటోని మామి చేతికిచ్చింది.

మామి దాన్ని అందుకుని, దానికి చుట్టిన కాగితం తీసి, కళ్ళ జోడు సరిచేసుకుని దీపానికి దగ్గరగా వెళ్ళి పరీక్షగా ఆ ఫొటోని చూసింది.

"వీడు మా వెంకాయమ్మ కొడుకు జెగన్నాథం. వీడు తెలియకేం? వీడూ తెల్సు. వీళ్ళ అమ్మా తెల్సు నాకు. మీ పెళ్ళి ఫొటోనా ఇది? బాగుంది".

సీతకు ఆమె మాటలకు ధైర్యం వచ్చింది.

"మరి వెళ్దామా?" అంది సీత ఆదుర్దాగా.

"ఇప్పుడెలాగమ్మా! ఆటో దొరకదు. పైగా చాలా దూరం" అంది మామి.

"పోనీ, అడ్రస్ చెప్పండి. మేము దిగబెడతాము" అన్నాడు పంకజం భర్త అరవంలో.

"ఆ వీధి పేరూ, అవీ తెలియవు. ఇల్లు తెలుసును అంతే" అంది మామి.

"మరెలాగండీ?" అంది సీత ఆందోళనగా.

"ఏం ఫర్వాలేదమ్మా! ఈ రాత్రికి నువ్వు నాతో పాటు మా ఇంట్లో వుండు. రేపు నేను తీసుకెళ్ళి దిగబెడతాను" అంది మామి.

సీత మొహం వికసించింది.

వీళ్ళిద్దరి సంభాషణల సారాంశం పంకజానికీ, ఆమె భర్తకీ, ఆరుముగానికీ అరవంలో చెప్పింది మామి.



## చంద్రచూర్ సింగ్ తిరుగుళ్లు

సినిమాలెలాగూ లేవు కనీసం అమ్మాయిల్ని తిప్పకుందామన్నా ఎవరూ రావట్లేదని బాధ పడుతున్న చంద్రచూర్ సింగ్‌కి అనుకోకుండా మహిమా చౌదరి నుంచి పిలుపొచ్చింది. దాంతో ఎగరేసుకుంటూ రెడీ అయి వెళ్తే బయట తిరగడం నాకిష్టం లేదు. ఇక్కడ మా ఇంట్లోనే ఏదైనా అందట. చంద్రచూర్ మాత్రం సినిమా కథ మహిమా ఇంట్లో వినడానికెళ్తున్నా నంటున్నాడు.

వాళ్ళంతా సీతమ్మా, మామినీ కింది దాకా వచ్చి దిగబెట్టారు.

ఆ రాత్రంతా సీతను మామి కన్నతల్లి కన్నా ఎక్కువగా ఆదరించింది. స్నానం చేయమని చెప్పి బీరువాలో వున్న తన చీర ఇచ్చింది కట్టుకోవడానికి. అన్నం పెట్టి తన పక్కనే పడుకోబెట్టుకుంది. 'భర్తతో ఈ రాత్రంతా గడపాల్సిన అమ్మాయి తన దగ్గర వుండాల్సి వచ్చింది పాపం' అని బాధ పడింది.

*** *** ***

తెల్లవారింది.

మామి కాలకృత్యాలన్నీ పూర్తి చేసుకుని పూజలో కూచొనే ముందు సీతను లేపింది. సీత స్నానం చేసి రెడీ అయ్యేసరికి మామి పూజ కూడా పూర్తయింది. సీత తన సొంత చీర కట్టుకకుని బయల్దేరింది.

ఇద్దరూ హోటల్లో జెగన్నాథం ఇంటి దగ్గర దిగారు.

మామి తలుపు తట్టింది.

"ఎవరూ?" అని వెంకాయమ్మ లోపల్నుంచే అడిగింది.

"చుట్టాలం. మీ కోడల్ని తీసుకొచ్చాం" అంది మామి.

వెంకాయమ్మ గారు తలుపు తెరిచింది. వీరిని చూసి నిర్ఘాంతపోయింది.

"కుడి కాలు పెట్టమ్మా" అంది మామి.

అరటి పండ్లు, పసుపూ, కుంకుమా, చీర, రవికల గుడ్డ, స్వీట్స్ ప్యాకెట్ వున్న పళ్ళెం సీత చేతికి ఇచ్చింది మామి. ఆ పళ్ళెం పట్టుకుని, పెళ్ళి ఫొటోతో ఇంట్లోకి వెళ్ళింది సీత.

"రా వదినా! ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు?" అంటూ లోపలకు తీసుకెళ్ళింది వెంకాయమ్మ గారు.

"మా కోడలు మీకు ఎలా కనిపించింది?" అని అడిగింది.

"మా పక్క బ్లాకులో అబ్బాయి స్కూటర్ ఎక్కి వచ్చేసిందట! వాళ్ళకి తెలుగు రాదు. మీ కోడలుకు అరవం రాదు. నాకు కబురు చేశారు. అదృష్టం బాగుంది. వీళ్ళ పెళ్ళి ఫొటో చూసి, గుర్తుపట్టి తీసుకొచ్చాను" అని జెగన్నాథం వైపు తిరిగి–

"ఏమయ్యా జెగ్గూ! కాస్త వెనకా ముందూ చూసుకోవద్దూ? ఓ మాటు దాన్ని పలకరించి బయల్దేరితే ఎంత బాగుండును? పైగా ఈ హెల్మెట్ ఒకటి. ముక్కూ, మొహం తెలియకుండాను" అంది మామి.

జెగన్నాథం సిగ్గుతో తల వంచుకున్నాడు.

సీత అతని వంక చూసింది చిరునవ్వుతో.

"కూచో వదినా కాఫీ తెస్తాను" అంది వెంకాయమ్మ గారు.

"ఒద్దమ్మా! నేను గుడికి వెళ్తున్నాను. ఏమీ తాగను. నువ్వు కూడా రా" అంది మామి.

వెంకాయమ్మ గారు కూడా మామితో గుడికి బయలుదేరారు.

"తలుపు గడియ వేసుకో" అంది వెంకాయమ్మ గారు.

జెగన్నాథం తలుపు గడియ వేసి సీత దగ్గరకు వచ్చాడు.

"భలే పని చేశారండీ" అంది సీత సిగ్గు, వెటకారం కలిపి.

"నువ్వు మాత్రం?"

"నేను కాదు– మీరే!"

"సర్లే–" అని జెగన్నాథం లోపలకు వెళ్ళి మల్లె పూలు తెచ్చి ఆమె తలలో తురిమాడు.

"నిన్న కొన్న పూవులు వాడిపోలేదే!" అని సీతను దగ్గరకు తీసుకున్నాడు.

"రాత్రి 'వాడలేదుగా' అందుకని!" అని సీతను దగ్గరకు తీసుకున్నాడు.

"మీ అమ్మ గారొస్తారు" అంది సీత.

"వాళ్ళు రారు. వాళ్ళు గుడికి వెళ్ళింది మనం గదిలోకి వెళ్ళాలనే!" అన్నాడు.

ఇద్దరూ జంటగా గదిలోకి వెళ్ళారు.